సాక్షి కామారెడ్డి

మంగళవారం। 23। జనవరి। 2024



ట్రాన్స్‌ఫార్మర్లే టార్గెట్

చోరులు ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. దీంతో రైతులు ఇబ్బందిపడాల్సి వస్తోంది.

- 10లో ▸



ఫిర్యాదులను పరిష్కరించాలి

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 27 ఫిర్యాదులు నమోదయ్యాయి.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం

32.5 /17.7

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

వెన్నెలను అభినందించిన ఎస్పీ



కామారెడ్డి క్రైం: ఫిట్‌నెస్‌పై అవగాహన కలిగించేందుకు ఇటీవల కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర చేసిన విద్యార్థిని బానోత్ వెన్నెలను ఎస్పీ సింధు శర్మ అభినందించారు. సోమారంపేట్‌కు చెందిన వెన్నెల కామారెడ్డిలోని సాందీపని జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన 13 మంది సభ్యుల బృందంతో కార్గిల్‌నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర చేసింది. వీరి యాత్ర 23 రోజుల్లో 3,890 కిలోమీటర్లు సాగింది. సోమవారం ఎస్పీని కలిసింది. ఆమెను ఎస్పీ సింధుశర్మ, ట్రెయినీ ఐపీఎస్ కాజల్ సింగ్ అభినందించారు.

ఎమ్మెల్సీగా మహేశ్‌కుమార్ గౌడ్ ఎన్నిక



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిట్నరింగ్ అధికారి సోమవారం ప్రకటించారు. మహేశ్‌కుమార్‌కు ధ్రువపత్రాన్ని అందజేశారు.

ఎంబీబీఎస్ ఫస్టియర్ ఫలితాలు విడుదల

నిజామాబాద్‌నాగారం: ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ఫలితాలు విడుదలయ్యాయి. ఇందులో నిజామాబాద్ మెడికల్ కళాశాల విద్యార్థులు 95.83 శాతం ఉత్తీర్ణత సాధించారు. 2022 సంవత్సరానికి సంబంధించి 2023 నవంబర్‌లో విద్యార్థులు మొదటి సంవత్సర పరీక్షలు రాశారు. ఈ ఫలితాలు ప్రస్తుతం విడుదలయ్యాయి. నిజామాబాద్ మెడికల్ కళాశాలకు చెందిన 120 మంది పరీక్షలు రాయగా ఐదుగురికి 75 శాతానికి పైగా మార్కులు వచ్చాయి. 65 మంది ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించారు. మరో 45 మంది విద్యార్థులు పాసయ్యారు. ఐదుగురు విద్యార్థులు ఫెయిల్ అయినట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా తెలిపారు.

బడాపహాడ్ ఉర్సు ప్రారంభం



వర్ని: మండలంలోని జలాల్పూర్ బడాపహాడ్ ఉర్సు సోమవారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే పోచారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. జలాల్పూర్ నుంచి గంధాలను ఊరేగింపుగా బడా పహాడ్‌కు తీసుకువెళ్లారు. ఉర్సు బుధవారం వరకు కొనసాగనుంది. ఉత్సవాల్లో డీసీసీబీ అధ్యక్షుడు పోచారం భాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి, జెడ్పీటీసీ హరిదాసు, నాయకులు ఎలమంచిలి శ్రీనివాసరావు, గోపాల్, వీర్రాజు, సర్పంచ్ అనిత వెంకట్ గౌడ్ పాల్గొన్నారు.

పోటాపోటీగా ప్రారంభించిన నాయకులు

ఉర్సును ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు పోటాపోటీగా ప్రారంభించారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మొదట ఉత్సవాలను ప్రారంభించి గంధాలను ముజావర్లకు అందించారు. తిరిగి గంధాలను సభాస్థలి వద్దకు తీసుకువచ్చి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి మరోసారి ఉత్సవాలను ప్రారంభించారు.

ఆర్మూర్ బల్దియా చైర్‌పర్సన్ ఎన్నికకు ఏర్పాట్లు

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక అంశం ఎన్నికల కమిషన్ పరిధిలోకి వెళ్లింది. చైర్ పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న స్థానాలను గుర్తించి ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ సెక్రెటరీ అజయ్ కుమార్ ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం లేఖ రాశారు.

మద్నూర్‌లో తన్మయత్వంతో నృత్యం చేస్తున్న హనుమ వేషధారి



బాన్సువాడలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



నయనానందకరం..

- అయోధ్యలో కొలువైన బాలరాముడు
- జిల్లావ్యాప్తంగా ఆలయాలలో ప్రత్యేక పూజలు
- 'ప్రాణప్రతిష్ఠ'ను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన భక్తులు
- రామనామ స్మరణతో ప్రతిధ్వనించిన ఆలయాలు
- శోభాయాత్రలలో హోరెత్తిన జై శ్రీరాం నినాదాలు
- సాయంత్రం ఇంటింటా వెలిగిన దీపాలు



మద్నూర్‌లో సీతారాముల వేషధారణలో చిన్నారులు

రామ భక్తుల సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. జగదానంద కారకుడైన కౌసల్యానందనుడు అయోధ్యలో కొలువుదీరాడు. సోమవారం అయోధ్య నగరిలో కనుల పండువగా జరిగిన బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ క్రతువును ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించి భక్తులు తరించారు. రామజన్మ భూమిలో అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైన సందర్భాన్ని పురస్కరించుకుని సాయంత్రం ఇంటింటా దీపాలు వెలిగించి పండుగ చేసుకున్నారు.



దోమకొండ శివరాంమందిర్‌లో ప్రత్యేక పూజలో పాల్గొన్న మహిళలు



దేవునిపల్లిలో శోభాయాత్ర..

సాక్షి, కామారెడ్డి: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. ఈ అపూర్వ ఘట్టాన్ని పురస్కరించుకుని ఆలయాలు, కూడళ్ల వద్ద కాషాయ తోరణాలు కట్టారు. ఇళ్ల ముంగిట రంగవల్లులు అలంకరించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. రామాలయాలన్నీ ఉదయంనుంచే భక్తులతో కిక్కిరిసిపోయాయి. అయోధ్యలో జరుగుతున్న కార్యక్రమాన్ని వీక్షించడానికి వీలుగా పలుచోట్ల భారీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. స్క్రీన్లపై కార్యక్రమాన్ని సామూహికంగా తిలకించి భక్తులు పులకించారు. రామనామ స్మరణతో ఆలయాల పరిసరాలు ప్రతిధ్వనించాయి. ఆలయాల వద్ద అన్నదానాలు చేశారు. ప్రతి ఊరిలో జరిగిన వేడుకల్లో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటింటా దీపావళి

రామ జన్మభూమిలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో పలుచోట్ల శోభాయాత్రలు నిర్వహించారు. సాయంత్రం ప్రతీ ఇంట్లో దీపాలు వెలిగించారు. చాలామంది టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఉత్సవం నేపథ్యంలో కామారెడ్డి పట్టణంలో వ్యాపార, వాణిజ్య సంస్థలను మూసి ఉంచారు.



కామారెడ్డి టౌన్: ఎన్జీవోస్ కాలనీలోని ఆలయంలో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్

పార్టీలకతీతంగా..

జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, నాయకులు ఆలయాల్లో జరిగిన వేడుకలకు హాజరయ్యారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎల్లారెడ్డి, కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో జరిగిన వేడుకలకు ఎంపీ బీబీ పాటిల్ హాజరయ్యారు. బాన్సువాడ నియోజకవర్గంలోని పోచారం, దేశాయిపేట్, రాంపూర్ తండాల్లో జరిగిన వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ పలు మండలాల్లో జరిగిన వేడుకలకు హాజరయ్యారు. జుక్కల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావు, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పాల్గొన్నారు.



భిక్కనూరులో ర్యాలీ..



కామారెడ్డి టౌన్: వివేకానంద కాలనీలో స్క్రీన్‌పై ప్రాణప్రతిష్ఠను వీక్షిస్తున్న భక్తులు



భిక్కనూరులో బాలరాముడి వేషధారణలో చిరునవ్వులు చిందిస్తున్న చిన్నారి

పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి



వికసిత భారత్ క్యాలెండర్, వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్

కామారెడ్డి క్రైం: పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం వికసిత భారత్ కార్యక్రమాన్ని చేపట్టిందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో సోమవారం వికసిత భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలనేదే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమన్నారు. పట్టణాల్లోని వీధి వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తున్నామన్నారు. తీసుకున్న రుణాలను సక్రమంగా తిరిగి చెల్లించినవారికి రెట్టింపు రుణాలు ఇస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో లబ్ధిపొందినవారు తమ అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. అనంతరం వికసిత భారత్ క్యాలెండర్లు, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, డీఏవో భాగ్యలక్ష్మి, ఎల్‌డీఎం భార్గవ్ సుధీర్, ఎస్‌బీఐ మేనేజర్ వినయ్ చంద్ర, పీఆర్పీ సునీత, తెలంగాణ సాంస్కతిక సారథి కళాకారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, వీధి వ్యాపారులు, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

'నెలాఖరులోగా లక్ష్యం చేరుకోవాలి'



కామారెడ్డి క్రైం: కస్టం మిల్లింగ్ రైస్‌కు సంబంధించిన లక్ష్యాన్ని నెలాఖరులోగా పూర్తి చేయాలని ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ సూచించారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎంఆర్‌లో జాప్యాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. రైస్‌మిల్లర్లు లక్ష్యం మేరకు బియ్యాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. లక్ష్యాన్ని చేరుకునేందుకోసం మిల్లులను నిరంతరాయంగా నడిపించాలని రైస్‌మిల్లర్లను ఆదేశించామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఎఫ్‌సీఐ గోదాముల్లో ధాన్యం నిల్వలకు స్థలం కేటాయించాలని జీఎంను కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ ప్రకాష్ వర్మ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మేనేజర్ శేఖర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ అభిషేక్ సింగ్, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల సమస్యలను పరిష్కరించాలి'

భిక్కనూరు: ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కృషిచేయాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సూచించారు. సోమవారం భిక్కనూరు మండల కాంగ్రెస్ నేతలు హైదరాబాద్‌కు వెళ్లి షబ్బీర్‌అలీని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్నవారికి తగిన గుర్తింపు దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలిరెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు కుంట లింగారెడ్డి, బల్యాల రేఖ, బల్యాల సుదర్శన్, భీంరెడ్డి, లింబాద్రి, మైపాల్‌రెడ్డి, మోహన్ రెడ్డి, అంకం రాజు నర్సరెడ్డి, రవి, సుధాకర్‌రెడ్డి, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.



షబ్బీర్‌అలీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

క్లుప్తంగా

'బేటీ బచావో.. బేటీ పడావో' ప్రతిజ్ఞ



సుభాష్‌నగర్: జాతీయ బాలికల దినోత్సవాలను పురస్కరించుకుని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో 'బేటీ బచావో – బేటీ పడావో' కార్యక్రమంపై జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈమేరకు అంకితభావంతో కృషి చేస్తామని జిల్లా అధికారులు ప్రతిజ్ఞ చేసి సంతకాలు చేశారు. అనంతరం జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమ ఏర్పాట్లపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేశారు. ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాలు విస్తృత స్థాయిలో నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. పాఠశాల స్థాయితో పాటు ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీ కల్మేశ్వర్ సింగేనవార్, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, ఐసీడీఎస్ పీడీ రసూల్ బీ, డీఈవో దుర్గాప్రసాద్, డీఐఈవో రఘురాజ్ ,తదితరులు పాల్గొన్నారు.



నేటితో ముగియనున్న టీజీసెట్ దరఖాస్తు గడువు

డిచ్‌పల్లి : రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మహాత్మ జ్యోతిరావుపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధారణ గురుకుల పాఠశాలల్లో 2024–25 సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుకు మంగళవారం (ఈ నెల 23న) తుది గడువని సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ కే అలివేలు, జిల్లా కోఆర్డినేటర్ బి సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'మాజీ సైనికుల సంక్షేమానికి పాటుపడుతాం'

నిజామాబాద్‌నాగారం : మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడుతామని సుబేదార్ ఏఎస్ రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా సైనిక వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మాజీ సైనికులతో సమావేశం నిర్వహించారు. మాజీ సైనికుల సమస్యలు, వారికి రావాల్సిన రిటైర్మెంట్ బెన్ఫిట్స్ గురించి తెలుసుకున్నారు. మద్రాస్ రేంజిమెంట్ పరిధిలో పని చేసిన మాజీ సైనికోద్యుగుల సంక్షేమానికి పాటుపడుతామన్నారు. ఉద్యోగులు ప్రధాన్, జైసాగర్, గంగా శేఖర్ ఉన్నారు.

కార్యదర్శి అవినీతిపై విచారణ



సాక్షి ఎఫెక్ట్..

వర్ని : వర్ని మార్కెట్ కమిటీలో వడపోత యంత్రాల మోటార్ల గల్లంతు, ఇతర ఆరోపణలపై సోమవారం దక్షిణ తెలంగాణ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ హర్ష విచారణ చేపట్టారు. 'అవినీతికి అడ్డా.. వర్ని ఏఎంసీ' శీర్షికన సాక్షి పత్రికలో ఈ నెల 19న ప్రచురితమైన కథనానికి మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించారు. విచారణ పూర్తయిన తర్వాత ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఆమె తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లే టార్గెట్..

- రెచ్చిపోతున్న దొంగలు
- కాపర్ వైర్, ఆయిల్ చోరీ
- కరెంట్ లేక ఎండుతున్న పంటలు



నిజాంసాగర్ : వ్యవసాయ భూముల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లే లక్ష్యంగా దొంగలు రెచ్చిపోతున్నారు. మద్యానికి, జల్సాలకు అలవాటు పడిన కొందరు సులువుగా డబ్బు సంపాదించాలని ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్లు, ఆయిల్ చోరీ చేస్తున్నారు. అర్ధరాత్రి కరెంట్ ఉన్న సమయాల్లోనూ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైరు, ఆయిల్ ఎత్తుకెళ్తున్నారు. రెండు రోజుల కిందట నిజాంసాగర్ శివారులో, నాలుగు రోజుల క్రితం గోర్గల్ శివారులో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేశారు. నాలుగు నెలల సమయంలో మండలంలోని అచ్చంపేట, బ్రహ్మణపల్లి, ఆరేడ్, సుల్తాన్‌నగర్ శివారుల్లో 12 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేశారు.

రైతుల తిప్పలు

ఒక్కొక్క ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వంద లీటర్ల వరకు ఆయిల్, 15 కిలోల కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్తున్న దొంగలకు రూ.45 వేల నుంచి రూ.60 వేల లబ్ధి పొందుతున్నారు. కానీ సదరు రూ.లక్ష ఖర్చు చేస్తే తప్పా మళ్లీ ట్రాన్స్‌ఫార్మర్ దొరకని పరిస్థితి ఉంది. ట్రాన్స్‌ఫార్మర్లను పాడు చేయడం సులువు అయినా సదరు ట్రాన్స్‌ఫార్మర్‌ను సాధించడం రైతులకు తలకు మించిన భారంగా మారుతోంది. అంతేగాకుండా కరెంట్ లేకపోవడంతో పంటలకు నీరు అందించడానికి అన్నదాతలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వేల రుపాయల పెట్టుబడులు పెట్టి పంట సాగు చేస్తుంటే ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఆగమాగం అవుతున్నారు. పోలీసులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

పంట ఎండిపోతుంది

గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి ఆయిల్, వైర్లను ఎత్తుకు వెళ్లారు. నాలుగు రోజుల నుంచి మోటార్‌కు కరెంట్ లేదు. దీంతో నీరందక పంట ఎండుతోంది. అధికారులు తొందరగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వాలి. లేకపోతే పక్క ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కనెక్షన్ ఇచ్చి ఆదుకోవాలి.

– సత్యాగౌడ్, బాధిత రైతు, నిజాంసాగర్

కేసు నమోదు చేస్తేనే ట్రాన్స్‌ఫార్మర్

చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి, ఎఫ్ఐఆర్ ఇస్తేనే బాధిత రైతులకు నెల, రెండు నెలల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తాం. ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలపై పోలీసులకు ఫిర్యాదు చేశాం.

– లక్ష్మణ్, ట్రాన్స్‌కో ఏఈ, నిజాంసాగర్

ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

- అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 27 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 13 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించిన భూసమస్యలవి కాగా మిగితావి ఆయా శాఖలకు చెందినవి నమోదయ్యాయి.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. భూసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డీఆర్‌డీవో సాయన్న, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉజ్వల భవిష్యత్తు

కామారెడ్డి టౌన్: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్షకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీవితంలో విద్యార్థి దశ ఎంతో ప్రధానమైనదని అన్నారు. తాను చదువుకున్న రోజుల్లో మెటీరియల్ బుక్స్ అందుబాటులో లేవని, ఇంతగా టెక్నాలజీ లేకున్నా ఒత్తిడి లేకుండా చదువుకున్నామని గుర్తు చేశారు. ఇప్పుడున్న నూతన టెక్నాలజీని వినియోగించుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, అదే టెక్నాలజీని అతిగా వినియోగించుకుని జీవితం నాశనం చేసుకోవద్దని సూచించారు. పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం లింగం, గంగాకిషన్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక

భిక్కనూరు: రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనకు భిక్కనూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పి. స్ఫూర్తిరెడ్డి, సహస్రలు రూపొందించిన ఈకో చానల్ ప్రాజెక్టు ఎంపికైంది. ఈమేరకు సోమవారం ఆన్‌లైన్ ద్వారా ఈకో చానల్ పనితీరును విద్యార్థులు ప్రదర్శించారు. ఆమ్ల వర్షాలకు కారకాలైన సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, కార్బన్ డైయాక్సైడ్‌లను గాలిలోకి చేరకుండా వాటిని లైమ్‌వాష్ చేయడం ద్వార ఈ ఆమ్ల స్వభావ వాయువులు తటస్థీకరించడుతాయని కాలుష్య ఉద్గారాలు వాతావరణంలో కలువకుండా నియంత్రించవచ్చని ఈ ప్రాజెక్టు ద్వారా వివరించారు. అలాగే ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థులు సాయి శ్రేయాస్, శివరాజ్, రూపొందించిన స్మార్టు రూఫ్, క్లీనర్ రాష్ట్రస్థాయికి ఎంపికైంది. వారిని పలువురు అభినందించారు.



విద్యార్థులు తయారుచేసిన ఈకో చానల్

ప్రత్యేక పూజల్లో మాజీ స్పీకర్ పోచారం



బాన్సువాడ రూరల్: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పోచారం, దేశాయిపేట్, రాంపూర్ తండాల్లో జరిగిన వేడుకల్లో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. స్థానికులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామచంద్ర స్వామి ప్రజలందరిని చల్లగా చూడాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సోదరుడు శంభురెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు అంజిరెడ్డి, మోహన్‌నాయక్, పిట్ల శ్రీధర్, తదితరులున్నారు.

బీఎస్పీ పాల్వంచ మండల కమిటీ ఏర్పాటు



మాచారెడ్డి: బీఎస్పీ పాల్వంచ మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు బట్టింకి బాల్ రాజు, కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి తమ్మడి స్వామి, కోశాధికారి హరిలాల్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శంకర్ బాబు, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్, కార్యదర్శులుగా రాజు, రమేష్ కోశాధికారిగా దేవేందర్, సలహాదారులుగా రాజు, భూమేష్, రవీందర్, మైశయ్య, నరేష్‌లను ఎన్నుకున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ సందరర్భంగా లింగంపేట రామాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శివ మందిర్ పాఠశాల చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అలాగే మహిళలు దాండియా ఆటలు ఆడారు. 1990 సంవత్సరంలో అయోధ్యకు వెళ్లిన 18 మంది కరసేవకులను రామ మందిర తీర్థ ట్రస్టు సభ్యులు, కుల సంఘాల అధ్యక్ష కార్యదర్శులతో కలిసి ఘనంగా సన్మాణించారు.

పిట్లం రామాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు

పిట్లం(జుక్కల్): అయోధ్య రామాలయ ప్రతిష్ఠాపన సందర్భంగా మండల కేంద్రంలోని రామాలయంలో సోమవారం శ్రీ రామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ పిట్లం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్, ఆలయ కమిటీ సభ్యులు, పద్మశాలి, ఆర్యవైశ్య, విశ్వబ్రాహ్మణ తదితర సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



పాల్గొన్న ఎంపీ బీబీ పాటిల్

శ్రీరాముడి జీవితం అందరికి ఆదర్శం

బాన్సువాడ రూరల్: శ్రీరాముడి జీవితం ప్రపంచంలో ఉన్న ప్రతి ఒక్కరికి ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. కుమారుడిగా, అన్నగా, భర్తగా, పరిపాలకుడిగా, రాజుగా, తండ్రిగా అత్యుత్తమ జీవితపాఠాలు నేర్చుకోవచ్చన్నారు. దేశాయిపేట్ గ్రామంలో జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమం, శోభాయాత్రలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్నారు.



దేశాయిపేట్ శోభాయాత్రలో ఏనుగు రవీందర్‌రెడ్డి

ప్రధాని మోదీ కారణజన్ముడు..

–మాజీ ఎంఎల్‌ఏ యెండల లక్ష్మీనారాయణ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): దేశ ప్రధాని నరేంద్ర మోదీ కారణజన్ముడని మాజీ ఎంఎల్‌ఏ యెండల లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా నస్రుల్లాబాద్, కామిశెట్టిపల్లి తదితర గ్రామాల్లో ఆలయాలను సందర్శించారు. రాముల వారిని దర్శించుకుని ప్రజలతో మాట్లాడారు. నరేంద్ర మోదీ కృషి ఫలితంగానే రామాలయ నిర్మాణం సాధ్యమైందన్నారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు సున్నం సాయిలు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.



హిందూ సంప్రదాయాన్ని మించినది ఏదీ లేదు

–కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్

భిక్కనూరు: సనాతన హిందూధర్మం, సంప్రదాయాన్ని మించినది ఏది కూడా ప్రపంచంలో లేదని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం భిక్కనూరు మండల కేంద్రంలో శ్రీరామదండు ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ మహోత్సవం వీక్షించడం పూర్వ జన్మ సుకృతం అన్నారు. ప్రపంచంలో హిందూ మతమే మొట్టమొదటి మతమన్నారు. హిందు మతం అనేది సంస్కృతి, సాంప్రదాయలకు నెలవు అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను భిక్కనూరు శ్రీరామదండు ప్రతినిధులు సన్మానించారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేవీఆర్

నేటితో నెరవేరిన వందల ఏళ్ల కల

బిచ్కుంద(జుక్కల్): ఐదు వందల ఏళ్ల నుంచి వివాదంలో ఉన్న శ్రీరాముని భవ్య మందిరం నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపన నేటితో నెరవేరిందని, అన్ని వర్గాల ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆకాంక్షించారు. సోమవారం అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా బిచ్కుందలో మింజర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే లక్ష్మికాంతరావు, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే అరుణతార, ఎంపీపీ అశోక్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కరసేవకులకు సన్మానం

1990, 1992లో అయోధ్యకు వెళ్లిన కరసేవకులను ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల చేతుల మీదుగా సన్మానించారు. మండలంలో 20 మంది కరసేవకులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన పూర్వీకుల కల నెరవేరడం చాలా ఆనందంగా ఉందన్నారు.



బిచ్కుందలో కరసేవకులను సన్మానిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

షబ్బీర్ అలీకి శుభాకాంక్షల వెల్లువ



షబ్బీర్ అలీని సన్మానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు



శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కామారెడ్డి టౌన్: తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వ్యవహారాల సలహాదారుడిగా నియమితులైన షబ్బీర్ అలీని జిల్లా కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనే శ్రీనివాస్, జిల్లా నాయకులు గద్దం చంద్రశేఖర్, చాట్ల వంశీకృష్ణ, కారంగుల అశోక్‌రెడ్డి, దేవాగౌడ్, తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దోమకొండ: జెడ్పీటీసీ తిర్మల్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, ఎంపీటీసీ పిరంగి రాజేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, నాయకులు సీతారాం మధు, రామస్వామి గౌడ్, ముత్యంపేట మాజీ ఉప సర్పంచ్ శిరీష్ గౌడ్ తదితరులు షబ్బీర్ అలీకి శుభాకాంక్షలు తెలిపారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న దోమకొండ నేతలు

క్రైం కార్నర్

రైలునుంచి పడి ఒకరికి తీవ్ర గాయాలు



కామారెడ్డి క్రైం : ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన జిల్లా కేంద్రానికి సమీపంలోని అడ్లూరు శివారులో సోమవారం వేకువజామున వెలుగు చూసింది. దాదాపు 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి రైలులో నుంచి పడగా తలకు తీవ్రంగా గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడిని ఏరియా ఆస్పత్రికి తరలించి రైల్వే ఎస్సై తావూ నాయక్ విచారణ జరిపారు. గాయపడిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ప్రస్తుతం అతను అపస్మారక స్థితిలో ఉన్నాడు.

బైక్‌పై నుంచి పడి యువకుడికి..



దోమకొండ : దోమకొండ శివారులోని అభ్యుదయ పాఠశాల వద్ద సోమవారం కుక్క అడ్డు రావడంతో బైక్‌పై నుంచి పడి సందెల దినేష్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బీటీఎస్ నుంచి దోమకొండకు వస్తుండగా కుక్క ఎదురుగా వచ్చింది. బైక్ మధ్యలో కుక్క ఇరుక్కుపోగా అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కాగా కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం కామారెడ్డికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



శంకర్ (ఫైల్)

తాడ్వాయి : మండలంలోని సోమారం శివారులో అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. తాడ్వాయి గ్రామానికి చెందిన ముదాం శంకర్(45) మృతదేహం మండలంలోని సోమారం శివారులో సోలార్ ప్లాంట్ సమీపంలో రోడ్డు పక్కన పడి ఉంది. సోమవారం ఉదయం సమాచారం అందుకున్న ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, ఎస్సై ఆంజనేయులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహం వద్ద రక్తం మరకలు పరిశీలించగా సమీపంలోని వ్యవసాయ భూమి వరకు ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు శంకర్ తలపై కొట్టి హత్య చేసినట్లు తెలుస్తోంది. వ్యవసాయ భూమిలో హత్య చేసి అరకిలో మీటరు దూరంలో ఉన్న సోమారం శివారులోని రోడ్డుపై పడేసి, రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారు. దీంతో పోలీసులు డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి తనిఖీలు చేశారు. మృతుడికి భార్య లక్ష్మి, కూతురు రాధిక ఉన్నారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మృతదేహం లభ్యం

నవీపేట : మండలంలోని యంచ గోదావరి నది తీరంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. మూడు రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని ఆయన పేర్కొన్నారు. 30 నుంచి 35 ఏళ్ల లోపు గల మృతుడి ఒంటిపై టీ షర్టు, ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. జీపీ కార్యదర్శి సుధారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

జేసీబీ, మొరం టిప్పర్ల పట్టివేత

మాక్లూర్ : రాత్రి సమయాల్లో మొరం తరలిస్తున్న ఒక్క జేసీబీతో పాటు, రెండు టిప్పర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం తెల్లవారుజామున పట్టుకుని మాక్లూర్ పోలీసులకు అప్పగించారు. మండలంలోని అడవి మామిడిపల్లి శివారు నుంచి నిజామాబాద్‌లోని వెంచర్లకు మొరం తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఈ దాడులు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. పట్టుబడిన జేసీబీ దాస్‌నగర్‌కు చెందిన దాసుదిగా గుర్తించామన్నారు. రెండు మొరం టిప్పర్లు కూడా అదే గ్రామానికి చెందిన వారివని తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలుశిక్ష

కామారెడ్డి క్రైం : మద్యం తాగి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. రెండు రోజుల క్రితం పట్టణ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టణానికి చెందిన రాంచంద్రం, యాదగిరి డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. వారిని సోమవారం కోర్టుకు హాజరుపరిచారు. ద్వితీయశ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ వారికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 చొప్పున జరిమానా విధించినట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.